సాక్షి
ఖమ్మం
బుధవారం । 7 । మే । 2025



పారదర్శకంగా ఎంపిక

రాజీవ్ యువవికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. 8లో



గంజాయి రవాణాపై ఉక్కుపాదం

జిల్లా మీదుగా గంజాయి రవాణాను అరికట్టేలా విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ శాఖ డీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 27°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

పలువురు సీఐల బదిలీ

ముగ్గురు ఐజీ కార్యాలయానికి అటాచ్

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న దోమల రమేష్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సీఐగా, ట్రాఫిక్ సీఐ మోహన్ బాబును ఖమ్మం త్రీటౌన్ సీఐగా, ఖమ్మం వన్ టౌన్ సీఐ ఉదయ్‌కుమార్‌ను ఖమ్మం సీసీఎస్‌కు బదిలీ చేశారు. అలాగే, వెయిటింగ్‌లో ఉన్న తాటిపాముల కరుణాకర్‌ను ఖమ్మం వన్‌టౌన్ సీఐగా కేటాయించారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు రామకృష్ణ, తిరుపతి, సీసీఎస్ సీఐ బాలాజీని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఖమ్మం ట్రాఫిక్ సీఐ–1గా మాత్రం ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

నాణ్యమైన విత్తనాలే అందించాలి

కూసుమంచి: వర్షాకాలం సీజన్ సమీపిస్తున్నందున డీలర్లు నాణ్యమైన విత్తనాలు సమకూర్చుకుని రైతులకు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. మండలంలోని కూసుమంచి, పాలేరు, నాయకన్‌గూడెంల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన డీలర్లకు సూచనలు చేశారు. రికార్డుల్లో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా అనుమతి లేని విక్రయాలు చేపట్టినా, రైతులకు పూర్తి వివరాలతో రశీదులు ఇవ్వకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఓ వాణి పాల్గొన్నారు.

సదరమ్ క్యాంప్‌నకు 233 మంది



పరీక్షల కోసం వేచి ఉన్న దివ్యాంగులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంప్‌నకు 233మంది దివ్యాంగులు హాజరయ్యారు. మొత్తం 325 మంది స్లాట్ బుక్ చేసుకోగా 233 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. సదరమ్ సర్టిఫికెట్ల స్థానంలో యూడీఐడీ కార్డులు జారీ చేస్తుండగా, దివ్యాంగులకు వైకల్య పరీక్షలు నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ మేరకు అర్హత సాధించిన వారి చిరునామాకు నేరుగా కార్డులు అందుతాయని అధికారులు తెలిపారు.

భూగర్భ కేబుల్‌తో విద్యుత్ సరఫరా



కేబుల్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

మధిర: మధిరలో భూగర్భ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడంపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంగళవారం విద్యుత్, ఆర్‌అండ్ బీ, మున్సిపల్ అధికారులు పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సమావేశం కాగా, ఖమ్మం ఎస్‌ఈ శ్రీనివాసచారి మాట్లాడారు. ఆత్కూరు క్రాస్ నుంచి మధిరలోని నందిగామ బైపాస్, ఆర్‌వీ కాంప్లెక్స్ నుంచి బస్టాండ్ వరకు భూగర్భ కేబుల్‌తో అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఏజెన్సీ ద్వారా సిద్ధమవుతున్న డీపీఆర్‌ను ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీఈలు బండి శ్రీనివాసరావు, హీరాలాల్, ఆర్‌అండ్‌బీ డీఈ శంకర్‌రావు, మున్సిపల్ డీఈ నరేష్‌రెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు అనురాధ, నాగమల్లేశ్వరరావు, అనిల్‌కుమార్, కన్సల్టెన్సీ ప్రతినిధి భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర

కల్లూరు: ధాన్యం సరైన తేమ శాతం వచ్చేవరకు ఆరబోసి, తాలు లేకుండా తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత తెలిపారు. కల్లూరు మండలం పుల్లయ్యబంజర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, ఆర్‌డీఓ ఎల్.రాజేందర్, డీపీఎం దర్గయ్యతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోళ్లలో జాప్యంతో ఇబ్బంది ఎదురవుతోందని, మిల్లర్లు తరుగు పేరుతో కోత విధిస్తున్నారని రైతులు వాపోయారు. ఈమేరకు డీఎం మాట్లాడుతూ సరిపడా గన్నీ బస్తాలు, లారీలు సమకూరుస్తామని తెలిపారు. మార్కెట్ చైర్మన్ భాగం నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం బైపాస్‌లోని ఓ భవనంపై పిల్లర్లతో సహా కూలిన హోర్డింగ్



వైరాలో రహదారిపై కూలిన చెట్టును తీయిస్తున్న పోలీసులు



తల్లాడ మండలం మల్లవరంలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షపునీరు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించింది. పగలంతా ఎండ తీవ్రత ఉండగా, సాయంత్రం 4–30 గంటల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలోనే కాక కొణిజర్ల, వైరా, తల్లాడ, మధిర మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించగా.. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు రహదారులు, విద్యుత్ లైన్లపై విరిగిపడ్డాయి. ఈ కారణంగా అటు రాకపోకలు, ఇటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంతేకాక పలుచోట్ల కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిచిపోయాయి. – ఖమ్మం వ్యవసాయం

గాలివాన బీభత్సం

- గంట పాటు జిల్లాలో ఆగమాగం
- రోడ్లపై విరిగిపడిన చెట్లతో ఆగిన రాకపోకలు
- కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం



ఖమ్మంలోని వైరా రోడ్డుపైకి చేరిన వరదనీటిలో వాహనదారుల ఇక్కట్లు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఈదురుగాలుల కారణంగా ఖమ్మం నగరంతో పాటు వైరా, కొణిజర్ల, మధిర, ఖమ్మం రూరల్ మండలం, తిరుమలాయపాలెం, కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం, పెనుబల్లి, ఏన్కూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడడంతో సాయంత్రం 5 గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. ఖానాపురం, టేకులపల్లి, జిల్లా ఆస్పత్రి, మంచుకొండ, ఇల్లెందు క్రాస్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్లు దెబ్బతిన్నాయి. ప్రకాష్‌నగర్‌లో ఓ గోదాం రేకులు లేచిపోయి 11 కేవీ విద్యుత్ లైన్‌పై పడటంతో సమీప ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈమేరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు పునరుద్ధరణ పనులు చేపడుతూనే ఇంటర్ లికింగ్ విధానం అమల్లో ఉన్న ప్రాంతాల్లో ఇతర సబ్‌స్టేషన్ల నుంచి సరఫరా ఇచ్చారు. అయినా ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో రాత్రి పొద్దుపోయే వరకు కూడా విద్యుత్ సరఫరా జరగలేదు.

కూలిన చెట్లు, ఎగిరిపోయిన పైకప్పులు

ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. రహదారుల వెంట చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే, పలుచోట్ల హోర్డింగ్‌లు విరిగి పడగా, ఫ్లెక్సీలు తెగిపోవడంతో పాటు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఇక వర్షం మొదలుకాగానే కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెట్టారు. అప్పటికే పలుచోట్ల ధాన్యం తడవగా, మిగిలిన ధాన్యం పట్టాలు కప్పి రక్షించుకున్నారు.

అన్నదాతపై పగ

రైతులపై ఈ ఏడాది ప్రకృతి పగబట్టినట్లుగానే పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దిరోజులుగా ఈదురుగాలులు, అకాల వర్షాలతో యాసంగి పంటలకు నష్టం జరుగుతోంది. వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతినడమే కాక ఈదురుగాలులకు మామిడి, బొప్పాయి తోటలు ధ్వంసమవుతున్నాయి. ఇటీవల జిల్లాలో దాదాపు 1,776 రైతులకు చెందిన 3212 ఎకరాల్లో వరి, మొక్కజొన్నతో పాటు మరో 200 ఎకరాల్లో మామిడి, బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు.

మరికొన్ని ఫొటోలు - 9లో

పగలంతా ఎండ, సాయంత్రం వాన

జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు ఎండ దంచికొట్టగా ఆతర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. ముదిగొండ మండలం పమ్మిలో అత్యధికంగా 40.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, పెనుబల్లిలో 40.8, బాణాపురంలో 40.7, బచ్చోడు, నేలకొండపల్లిలో 40.4, చింతకానిలో 40.3, ఖమ్మం ఖానాపురం, ఎర్రుపాలెంలో 39.7, వైరా ఏఆర్‌ఎస్, మధిరలలో 39.6, కాకరవాయిలో 39.5, పల్లెగూడెం, మధిర ఏఆర్‌ఎస్‌లో 39.4, కర్నులు, కుర్నవల్లి, వైరా, తల్లాడలో 39.3, వేంసూరులో 39.2, సిరిపురంలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక సాయంత్రం తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 30.3 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 26, ఖమ్మం ఖానాపురంలో 11.8, గుబ్బగుర్తిలో 11.3, కాకరవాయిలో 8.5, వైరాలో 5.5, తిమ్మారావుపేటలో 5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

అక్షరాస్యత పెంపునకు ప్రణాళిక

- విద్యార్థుల సంఖ్య పెంచేలా 'బడి బాట'
- అదనపు కలెక్టర్ శ్రీజ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచేలా ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె పాఠశాల విద్య, వయోజన విద్యపై జరిగిన సమీక్షలో మాట్లాడారు. నిరక్షరాస్యతను రూపుమాపేలా ప్రతీఒక్కరికి చదవడం, రాయడం నేర్పేందుకు కేంద్ర ప్రభుత్వం 'న్యూ ఇండియా లిటీరసి ప్రోగ్రాం'ను ప్రవేశపెట్టిందని తెలిపారు. జిల్లాలో 50వేల మంది నిరక్షరాస్యులు ఉండగా, వలంటీర్లను గుర్తించి ఒక్కొక్కరితో ఐదుగురికి చదువు నేర్పించాలని సూచించారు. ఇదే సమయాన మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో నిరక్షరాస్యుల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మేరకే ఉపాధ్యాయులు ఉండేలా చూస్తూ, అనవసర డిప్యూటేషన్లు రద్దుచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిర్దిష్ట కేడర్ కంటే అధికంగా ఉపాధ్యాయులు ఉంటే హెచ్‌ఎంలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం సిద్ధం చేయాలని, ప్రవేశాల పెంపే లక్ష్యంగా బడి బాట పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో అవసరమైన క్రీడా సామగ్రి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కష్టపడే వారికే పార్టీ పదవులు

- కాంగ్రెస్ మహా వృక్షం.. అందరికీ నీడనిస్తుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రూరల్ మండలం తల్లంపాడులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

కూసుమంచి: 'కాంగ్రెస్ పార్టీ అనేది వటవృక్షం.. ఈ పార్టీకి ఎత్తుపల్లాలు, విజయాలు సహజమే.. అయినా కాంగ్రెస్ ఎప్పుడూ సజీవంగానే ఉంటుంది' అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేసిన మంత్రి, ఆతర్వాత జరిగిన కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ సంస్థాగత సన్నాహక సమావేశంలో మాట్లాడారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఎందరికో పదవులు కట్టబెట్టడమే కాక త్యాగాలు, సంస్కరణలతో ప్రజలతో మమేకమైన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీలు చేసిన త్యాగమేంటో ప్రజలకు తెలుసునన్నారు. కాగా, ఇప్పటి వరకు పార్టీలో పనిచేస్తున్న వారు కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైతే పార్టీ కోసం కష్టపడతారో వారికే సంస్థాగత పదవులు వస్తాయని తెలిపారు. పార్టీ సంస్థాగత జిల్లా ఇన్‌చార్జి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా పార్టీని కిందిస్థాయి నుండి బలోపేతం చేసేలా దృష్టి సారించామని, మండలం నుండి గ్రామ స్థాయి వరకు అధ్యక్ష పదవులకు ఐదుగురి పేర్లతో జాబితా తయారు చేస్తామని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడమే కాక ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ చైర్మన్ వి.సీతారాములు, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, పార్టీ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, బత్తిన శ్రీనివాస్, స్వర్ణకుమారి, రామసహాయం వెంకటరెడ్డి, బోడ మంగీలాల్, బెల్లం శ్రీనివాస్, ఎం.గురవయ్య, కల్లెం వెంకటరెడ్డి, జెర్రిపోతుల అంజని తదితరులు పాల్గొన్నారు.

పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యం

ఖమ్మంరూరల్: పేదల ముఖాల్లో చిరునవ్వు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో పొంగులేటి మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతున్నాయని తెలిపారు. తరతరాలుగా అనుభవిస్తున్న భూములపై రక్షణ కోసం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, ఆర్‌డీఓ నర్సింహారావు, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి

సీఎం రేవంత్‌ను కోరిన మంత్రి తుమ్మల

ఖమ్మంఅర్బన్: గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దెబ్బతిన్న సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం సీఎంను కలిసిన ఆయన వివరాలు సమర్పించి మాట్లాడారు. ఎన్నెస్పీ ఎడమ, కుడి కాల్వలకు గండ్లు పడిన చోట మళ్లీ వర్షాకాలం రాకముందే మరమ్మతు చేయించాల్సి ఉందని తెలిపారు. అలాగే, అశ్వారావుపేట మండలం పెద్దవాగు ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతులకు రూ.3.50 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.90 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ఆయకట్టు ఉన్నందున ఏపీ ప్రభుత్వంతో చర్చించి తెలంగాణ నుంచి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. అంతేకాక చండ్రుగొండ మండలం సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు మరమ్మతులకు సైతం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అంచనాలు ఆమోదించండి..

సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి సవరించిన అంచనాలను ఆమోదించి పనుల్లో వేగం పెరిగేలా సమీక్షించాలని సీఎంను మంత్రి తుమ్మల కోరారు. ఈ అంచనాలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నందున, పరిపాలనా అనుమతులు వస్తే పనులు ప్రారంభించవచ్చని తెలిపారు. సీతారామతో పాటు సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టులు పూర్తయితే ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాకు గోదావరి జలాలు అందుతాయని వెల్లడించారు.

35 ఎకరాలు.. రూ.130కోట్లు

- రేపు మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొననున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



కొనసాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు


ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అత్యాధునిక వసతులతో కూడిన భవనాలు అందుబాటులోకి రానున్నాయి. మెడికల్ కాలేజీని ప్రస్తుతం పాత కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. అయితే, అన్ని సౌకర్యాలతో కూడిన భవనాలు ఉండాలనే భావనతో రఘునాథపాలెం మండలం బాలపేట సమీపాన బైపాస్ పక్కన 35 ఎకరాల ప్రభుత్వ భూములను కేటాయించారు. ఈ భూముల్లో నిర్మాణాలకు 8వ తేదీ గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లాకు చెందిన మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు.

ప్రధాన భవనం, హాస్టళ్లు

బాలపేట సమీపాన కేటాయించిన 35 ఎకరాల్లో భవన నిర్మాణాలకు రూ.130కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 3.81లక్షల చదరపు అడుగుల్లో కాలేజీ ప్రధాన భవనం నిర్మిస్తారు. అలాగే, 88 చదరపు అడుగుల్లో బాలికల హాస్టల్, 62వేల చదరపు అడుగుల్లో బాలుర హాస్టల్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే భూమి చదును చేయగా, సుమారు రూ.15 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని ఇంజనీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. కాగా, గురువారం జరిగే శంకుస్థాపనకు మంత్రులు హాజరుకానుండగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించి ఏర్పాట్లపై ఆర్ అండ్ బీ ఎస్‌ఈ యాకూబ్, ఈఈ యుగంధర్‌కు సూచనలు చేశారు.

మురుగు.. కనుమరుగు

- మధిరలో రూ.128 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ
- 2,655 మ్యాన్‌హోల్స్.. 99.56 కి.మీ. పైపులైన్
- ఏడాదిన్నరలో పూర్తిచేసేలా కార్యాచరణ



మధిర పట్టణ వ్యూ (ఇన్‌సెట్) మధిర మున్సిపాలిటీ పరిధిలో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నమూనా

మధిర: మధిర మున్సిపాలిటీ కొత్త రూపు సంతరించుకోనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచనలతో మధిరలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్‌ఐడీసీ) ద్వారా రూ.128 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో దాదాపు 99.56 కి.మీ. మేర అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించనున్నారు. పైపులైన్ విధానంలో నిర్మించే ఈ ప్రాజెక్టు పూర్తయితే మధిరలో డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

6,638 నివాస గృహాలు

మధిర మున్సిపాలిటీ పరిధిలో 6,638 గృహాలు ఉన్నాయి. వీటి ద్వారా వెలువడేతున్న మురుగు నీరు డ్రెయినేజీల ద్వారా ముందుకు సాగుతోంది. అయితే, అడ్డంకులు, అసంపూర్తి నిర్మాణాలతో నీరు నిలిచి, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండడమే కాక దోమల వృద్ధికి కారణమవుతోంది. చిన్నపాటి వర్షం వర్షం వచ్చినా నీరంతా రోడ్లపై చేరుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2,655 మ్యాన్‌హోల్స్ ఏర్పాటుచేసి, 99.56 కి.మీ. నిడివితో పైపులైన్ నిర్మిస్తారు. ఇళ్లలో నుంచి నీటిని మ్యాన్‌హోల్స్‌లోకి.. అక్కడి నుంచి సబ్ లైన్స్, ఆపై ట్రంక్ మెయిన్ ద్వారా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(మురికి నీటి శుద్ధి కేంద్రం)కు పంపుతారు.

నాలుగు ఎస్‌టీపీలు..

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా మధిరను నాలుగు జోన్లుగా విభజించారు. పట్టణాన్ని మొదటి జోన్‌గా, మడుపల్లిని రెండో జోన్‌గా, అంబారుపేట, ఇల్లెందులపాడులో 3, 4వ జోన్లు నిర్ధారించారు. ఆయా జోన్లలోని లోతట్టు ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(ఎస్‌టీపీ) నిర్మించి అక్కడికి మురుగునీటిని మళ్లిస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి వ్యవసాయ అవసరాలతో పాటు పార్కులు, డివైడర్లు,, రోడ్ల పక్కన పెంచుతున్న మొక్కలకు వినియోగిస్తారు. ప్రస్తుతం ఇళ్లలో నుంచి వెలువడుతున్న మురుగునీరు నేరుగా వైరా నదిలో కలిసి కలుషితమవుతోంది. యూజీడీ పనులు పూర్తయితే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ పనులను ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఏడాదిన్నరలోనే పూర్తిచేయాలని సూచించారు. పనులు పూర్తయ్యాక ఐదేళ్లపాటు నిర్మాణ కంపెనీయే నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుంది.


మధిరలో నిర్మించే ఎస్‌టీపీలు, నీటిశుద్ధి సామర్థ్యం

జోన్	శుద్ధి చేసే సామర్థ్యం
1	50 లక్షల లీటర్లు
2	9 లక్షల లీటర్లు
3	4 లక్షల లీటర్లు
4	5 లక్షల లీటర్లు

వర్షపు నీటికి ఎస్‌డబ్ల్యూడీ

మురుగునీరు ముందుకు సాగేలా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తుండగా వర్షపునీటిని తరలించేందుకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్(ఎస్‌డబ్ల్యూడీ) సిస్టమ్ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.75 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఎస్‌డబ్ల్యూడీ కోసం 29.93 కి.మీ. మేర డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులూ పూర్తయితే వర్షపునీరు ఓపెన్ డ్రెయినేజీ సిస్టమ్ ద్వారా నేరుగా వెళ్లి వైరా నదిలో కలుస్తుంది.


నాణ్యత ప్రమాణాలతో పనులు



డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను నాణ్యతతో పూర్తి చేస్తాం. వృథా నీటిని శుద్ధి చేయడంతో ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి. అంతేకాక పట్టణంలో దుర్వాసన, దోమల వృద్ధి సమస్యలు తగ్గిపోతాయి.

– నరేష్‌రెడ్డి, డీఈ, మధిర మున్సిపాలిటీ

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి



మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చొరవతో రూ.కోట్లలో నిధులు మంజూరవుతున్నాయి. అలాగే, పనుల నాణ్యతపై తరచుగా పర్యవేక్షిస్తున్నారు. యూడీజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అందరూ సహకరించాలి.

– మల్లాది వాసు, మాజీ కౌన్సిలర్

సమస్యలకు శాశ్వత పరిష్కారం



మధిరలో ఓపెన్ డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా మురుగు నీరు నిలిచి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దుర్వాసన, దోమలతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. యూడీజీ నిర్మాణంతో సమస్యలు పరిష్కారమై పట్టణం పరిశుభ్రంగా మారుతుంది.

– కోనా ధనికుమార్, మాజీ కౌన్సిలర్

క్లుప్తంగా

ఉద్యోగి కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కు



చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన ఎం.డీ.హనీఫ్ కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. ఈమేరకు రూ.14,98,610 చెక్కును మంగళవారం ఆయన కుటుంబీకులకు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అందజేసి మాట్లాడారు. శాఖాపరంగా ఎలాంటి సహకారమైన అందిస్తామని తెలిపారు.

జేవీఆర్ ఓసీలో పరిశీలన



సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని జేవీఆర్ ఓసీని సింగరేణి కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ మంగళవారం తనిఖీ చేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన పని ప్రదేశాలు, కార్యాలయాలను పరిశీలించి భద్రతపై ఆరా తీశారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, తొలిసారి ఓసీకి వచ్చిన అభిలాష్‌కు సెక్యూరిటీ సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. ఉద్యోగులు బండెల విజయేందర్, మల్లేష్, రవీందర్‌రెడ్డి, ఎం.జోసెఫ్, కేఎస్‌వీవీ.సత్యనారాయణ, ఎస్.కే.సుభానీ, మోతుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 8న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని ఆర్గనైజర్ సీహెచ్.గోపి తెలిపారు. చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్ – 7, 9, 11 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వివరాలకు 94401 62749 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఈనెల 10నుంచి గార్లఒడ్డులో బ్రహ్మోత్సవాలు

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటదుర్గాప్రసాద్ తెలిపారు. మొదటిరోజైన 10వ తేదీన సుప్రభాతసేవ, యాగశాల ప్రవేశం, 11న స్వామి జయంతి సందర్భంగా 108 కలశాలతో అభిషేకం, 12న శ్రీవిష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం, స్వామివారి ఎదుర్కోలు, కల్యాణం, 13న స్వామి వారి ఊరేగింపు, 14న మహా పూర్ణాహుతి తదితర పూజలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

కామర్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



రాంప్రసాద్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు జల్లా రాంప్రసాద్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. ఆయన 'ఇంపాక్ట్ ఆఫ్ మైక్రో ఫైనాన్స్ ఇంటర్వెన్షన్ ఆన్ సోషియో ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ బెనిఫీషియరీస్ – ఏ స్టడీ ఆఫ్ ఖమ్మం డిస్ట్రిక్ట్ తెలంగాణ స్టేట్' అంశంపై ఓయూ కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సంధ్యారాణి పర్యవేక్షణలో పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథం సమర్పించగా డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌ను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ జాకిరుల్లా, అధ్యాపకులు డాక్టర్ సర్వేశ్వరరావు, శాస్త్రి, బానోత్ రెడ్డి, సత్యవతి, సునంద తదితరులు అభినందించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,700	1,700
పెసలు	7,025	3,100
కందులు	6,500	6,500
మినుములు	6,250	6,050
అలసంద	5,950	5,900
మిర్చి	12,850	6,000
మిర్చి తాలు	5,900	4,500
పత్తి	7,550	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,058

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- రాజీవ్ యువ వికాసంలో 1:2 నిష్పత్తిలో జాబితా
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



గుదిమళ్లలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ప్రతీ మండలంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలద్వారా వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశాక ఆయన మాట్లాడుతూ పరిశీలన 90 శాతం పూర్తయిందని, తుది జాబితాపై తయారీపై దృష్టి సారించాలని తెలిపా రు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూనిట్ల లక్ష్యం మేరకు 1:2 నిష్పత్తిలో జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. దివ్యాంగులు, మహిళలు, అతి పేదలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ సూచించారు.

నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

ఖమ్మంగాంధీచౌక్: అర్హులైన వారికి నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఇళ్ల పురోగతి, లబ్ధిదారుల ఎంపికపై అధికారులతో సమీక్షించారు. పైలట్ గ్రామాల్లో 878 ఇందిరమ్మ ఇళ్లకు గాను 370 మందికి మొదటి విడత రూ.లక్ష నిధులు వచ్చాయన్నారు. మిగతాచోట్ల పనుల్లో వేగం పెరిగేలా పర్యవేక్షిస్తూ, ఇతర ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపికపై సూచనలు చేశారు. మండల కేంద్రాల్లో నిర్మించిన మోడల్ ఇళ్ల వద్దకు మేస్త్రీలను తీసుకెళ్లి తక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాకు 14,763 ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తే, 10,921 దరఖాస్తుల ఆధారంగా 9,150 మందిక అర్హులుగా గుర్తించినందున మరోమారు పరిశీలించాలని ఆదేశించారు. ఈసమావేశాల్లో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఈఓ సత్యనారాయణ, కల్లూరు ఆర్డీఓ రాజేందర్, హౌసింగ్ ఈఈ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోళ్లు

ఖమ్మంరూరల్: రైతులు యాసంగిలో సాగు చేసిన ధాన్యంలో చివరి గింజ వరకు నాణ్యత ఆధారంగా కొనుగోలు చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్లలోని కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన రైతులతో మాట్లాడారు. సరైన తేమ శాతం రాగానే కాంటా వేసి మిల్లులకు తరలించాలని, ఎక్కడా తరుగు తీయకుండా పర్యవేక్షించాలని ఉద్యోగులకు సూచించారు. కాల వర్షాల నేపథ్యాన కొనుగోళ్లలో వేగం పెంచి అదనంగా హమాలీలు, వాహనాలను సమకూర్చుకోవాలని తెలిపారు.

మామిడి మార్కెట్‌లో పరిశీలన

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రైతు మామిడి మార్కెట్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సహజసిద్ధంగా పండించిన పండ్లే విక్రయించేందుకు ఈ మా ర్కెట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం. వీ.మధుసూదన్, ఉద్యాన అధికారి అనితశ్రీ పాల్గొన్నారు.

9న మిట్టపల్లికి కేటీఆర్ రాక

రాయల విగ్రహావిష్కరణ, బహిరంగ సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కొండబాల తదితరులు

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లిలో తల్లాడ తొలి ఎంపీపీ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దివంగత రాయల శేషగిరిరావు విగ్రహాన్ని ఈనెల 9న ఆవిష్కరించనుండగా, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు. మండలంలోని మిట్టపల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10–30 గంటలకు రాయల విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించాక ఇక్కడ ఏర్పాటుచేసే సభలో ప్రసంగిస్తారని తెలిపారు. ఈమేరకు సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు సమీపంలోని నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంజనాపురానికి చెందిన కేతినేని సందీప్‌ను ఎమ్మెల్సీ తదితరులు పరామర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తాళ్లూరి జీవన్, దిరిశాల దాసురావు, ముర్వా మురళి, కట్టా అజయ్‌కుమార్, డి. వెంకట్‌లాల్, రుద్రాక్ష బ్రహ్మం, ఇంజం కృష్ణార్జున్ రావు, పోతురాజు వెంకటయ్య, రాయల రఘునందన్, రేవంత్, నాయుడు శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

హౌసింగ్ శాఖకు 14 మంది ఏఈలు

ఖమ్మంగాంధీచౌక్: గృహ నిర్మాణ శాఖలో 14 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈ)ను ఔట్ సోర్సింగ్‌విధానంలో నియమిస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాక వారికి పోస్టింగ్ ఇవ్వడంతో కేటాయించిన మండలాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యాన, గృహ నిర్మాణ శాఖను బలోపేతం చేయడం కోసం ఈ నియామకాలు చేపట్టారు. కాగా, జిల్లాలో నియమితులైన ఏఈల వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. కామేపల్లి మండలానికి డి.నగేష్, నేలకొండపల్లికి వి.లింగా, రఘునాథపాలెంకు జి.పుష్ప, చింతకానికి టి.సుప్రియ, తల్లాడకు షేక్ అస్మా, ఏన్కూరుకు బి.స్నేహ, కల్లూరుకు ఎస్.సాయిపవన్, వేంసూరుకు ఎం. శ్రీనివాస్, ముదిగొండకు బి.సతీష్, ఎర్రుపాలెంకుపి.గోపి,సత్తుపల్లికి వి.పవన్‌కల్యాణ్, పెనుబల్లికి వై.కమల్‌ప్రసాద్, కూసుమంచికి ఏ.రవి, తిరుమలాయపాలెంకు మిథున్‌కుమార్‌ను కేటాయించారు.

ఉపాధి హామీ సిబ్బందికి ఊరట

మూడు నెలలు వేతనాలు విడుదల

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మూడు నెలల వేతనాలను మంగళవారం విడుదల చేసింది. ఏప్రిల్‌కు సంబంధించిన వేతనాన్ని మాత్రం పెండింగ్‌లో ఉంచింది. ఉపాధి హామీ పథకం అమలులో ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి కొంతకాలంగా సకాలంలో వేతనాలు అందడం లేదు. నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిరసనలతో పాటు ఇటీవల పెన్‌డౌన్ నిర్వహించారు. వీరి సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఎట్టకేలకు జనవరి, ఫిబ్రవరి, మార్చి వేతనాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 839 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వేతనాలు జమ కావడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

సహకార ఆడిట్‌పై శిక్షణ



మాట్లాడుతున్న డీసీఓ గంగాధర్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో మంగళవారం సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ ఇన్‌స్పెక్టర్లకు సహకారఆడిట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, డీసీసీబీ సీఈఓ ఎన్.వెంకట్ ఆదిత్య పలు అంశాలపై అవగాహన కల్పించారు. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుతో పాటు అధికారులు మురళీధర్ రావు, సీహెచ్.రవికుమార్, కె.సందీప్, ఎస్‌కే.మౌలానా, పీఏసీఎస్‌ల కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఈఐఈడీ, డీపీఎస్ఈలో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: డీఈఐఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీఎడ్యుకేషన్), డీపీఎస్ఈ(డిప్లొమా ఇన్‌ప్రీస్కూ ల్ ఎడ్యుకేషన్) కోర్సుల్లో డీఈఈసీఈటీ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు డీఈఓ, డైట్ ప్రి న్సి పాల్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈనెల 15వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మార్కెట్‌లో వెలవెల.. రోడ్డంతా కళకళ

కార్బైడ్ రహితంగా పండించిన మామిడి పండ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా ఖమ్మం రోటరీనగర్‌లోని వీధివ్యాపారుల కేంద్రంలో ప్రత్యేక మార్కెట్ ఏర్పాటుచేశారు. పడావు పడి ఉన్న ప్రాంగణానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. తొలిరోజు ఇక్కడ 10 – 15 మంది వ్యాపారులు మామిడి పండ్లు విక్రయించారు. కానీ ఇప్పుడు ఆ సంఖ్య ఒకటి, రెండు దాటకపోగా.. జనాలు రాకపోవడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క రహదారుల వెంట మామిడిపండ్ల విక్రయాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఎప్పటిలాగే కొనసాగుతోంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ప్రత్యేక మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షెడ్లు



వైరా రోడ్డులో సైకిళ్లపై మామిడి పండ్ల విక్రయాలు

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి



పాత జీపీ భవనాన్ని పరిశీలిస్తున్న డీసీ, అధికారులు

వైరా: జిల్లా మీదుగా గంజాయి రవాణాను పూర్తిగా నియంత్రించడంపై దృష్టి సారించామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగానే విస్తృత తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం వైరా వచ్చిన ఆయన ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడారు. ఏపీ, ఒడిశా నుంచి ఖమ్మం మీదుగా హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో వైరాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. బస్టాండ్‌తో పాటుగా ఇతర ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగిస్తున్నామని చెప్పారు. కాగా, వైరా ఎక్సైజ్ కార్యాలయాన్ని పాత జీపీ కార్యాలయం, ఎన్నెస్పీ భవనాల్లోకి మార్చే ప్రతిపాదన ఉందని డీసీ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జి.నాగేందర్‌రెడ్డి, సీఐ మమత, ఎస్సైలు రతన్‌ప్రసాదరెడ్డి, సాయిరాం పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాల కల్పించేందుకు ఈనెల 8వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఎంఆర్‌ఎఫ్ కంపెనీలో మెకానిక్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా జరగనుండగా, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు హాజరుకావొచ్చన్నారు. ఎనిమిదో తరగతి మొదలు 12వ తరగతి వరకు చదివిన వారే కాక ఐటీ ఐ పూర్తిచేసిన వారు సైతం అర్హులని తెలిపారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు 8వ తేదీన ఉదయం 10గంటలకు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

విజిలెన్స్ విచారణకు అధికారులు?

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనుల నాణ్యతపై విజిలెన్స్ అధికారులు ఇటీవల తనిఖీ చేశారు. ఈ నేపథ్యాన విచారణ కోసం వరంగల్‌కు రావాలని కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో కొన్నాళ్ల క్రితం వరకు ఇక్కడ పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన అధికారులతో పాటు ప్రస్తుతం కేఎంసీలో పనిచేస్తున్న అధికారులు సైతం విజిలెన్స్ విచారణకు వెళ్లనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా అధికారులు విజిలెన్స్ విచారణలో సమర్పించాల్సి న నివేదికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

భద్రతా ప్రమాణాలతో ప్రమాదాలకు చెక్

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగులు విధినిర్వహణలో భద్రతా చర్యలు పాటించడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చని ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఖమ్మంలోని విద్యుత్ శాఖ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం టౌన్–1, టౌన్–2 సబ్ డివిజన్ల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొనగా ఎస్ఈ మాట్లాడుతూ ఎక్కడ కూడా ఏమరుపాటుగా ఉండొద్దని, యాప్ ద్వారానే ఎల్‌సీ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించగా, భద్రతా వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. డీఈలు నంబూరి రామారావు, బాబూరావు, ఏడీఈలు నాగార్జున, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న, ధాన్యం

మూడు గ్రామాల్లో రూ.10లక్షలకు పైగా నష్టం



రామకృష్ణాపురంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక ఉద్యోగులు

చింతకాని: మండలంలోని నర్సింహాపురం, రామకృష్ణాపురం, ప్రొద్దుటూరు గ్రామాల్లో మంగళవారం వే ర్వేరుగా జరిగిన అగ్నిప్రమాదాల్లో మొక్కజొన్న, ధా న్యం కాలి బూడిదయ్యాయి. మొక్కజొన్న చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం.. అదే సమయాన భారీగా వీచిన ఈదురుగాలులతో మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. నర్సింహాపురంలో జరిగిన ప్రమాదంలో కల్లాల్లో ఇద్దరు ఆరబోసిన సుమారు 300 క్వింటాళ్ల మొక్కజొన్న కంకులు పూర్తిగా కాలిపోయాయి. మంటలు గ్రామానికి సైతం వ్యాపించగా ద్విచక్ర వా హనంతో పాటు వరిగడ్డి వామి, రోటోవేటర్ దగ్ధమయ్యాయి. అలాగే, రామకృష్ణాపురంలోనూ ఈదురుగాలులకు మంటలు వ్యాపించి మామిడి చెట్లు, వ్యవసాయ విద్యుత్ మోటార్లు, గడ్డివాములు కాలిపోయా యి. గ్రామంలోకి మంటలురాకుండా గ్రామస్తులు మో టార్ల సాయంతో నీళ్లు చల్లినా అదుపులోకి రాలేదు. దీంతో అగ్నిమాపక శాఖ ఉద్యోగులకు సమాచారం ఇవ్వగా ఫైర్ ఆఫీసర్ బాలకృష్ణ, అగ్నిమాపక సిబ్బంది నాగేశ్వరరావు, నర్సింహారావు, గోపీకృష్ణ, రాంబాబు, మంద వీరస్వామి, నరేష్ చేరుకుని సుమారు రెండు గంటలపాటు శ్రమించిమంటలను అదుపుచేశారు. ఈ సమయాన గ్రామమంతా పొగతో నిండిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇక ప్రొద్దుటూరులో సైతం మొక్కజొన్న కంకితో పాటు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం మంటలకు దగ్ధమైంది. నర్సింహాపురంలో సుమారు రూ.7.30 లక్షలు, ప్రొద్దుటూరులో రూ.లక్ష, రామకృష్ణాపురంలో రూ.2 లక్షల విలువైన పంటలకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెం స్టేజీ వద్ద మంగళవారం ఆటోను ఎదురుగా వచ్చినలారీ ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఖమ్మం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆళ్లకుంట నవీన్(20) ఆటోలో తల్లాడ మండలం గాంధీనగర్ తండాకు వచ్చి మామిడికాయలు కొన్నాక తిరిగి ఆటోలో బయలుదేరాడు. ఈక్రమాన రెడ్డిగూడెం స్టేజీ వద్ద ఖమ్మం నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న నవీన్ లారీ టైరు కింద పడగా తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, ఆటోలో ఉన్న నవీన్ చెల్లెలు ఆళ్లకుటం అజితకు గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

అడవి గేదెల దాడిలో ఇద్దరికి గాయాలు

సత్తుపల్లిరూరల్: రహదారిపై వెళ్తున్న ఆటోకు అడ్డుగా వచ్చిన అడవి గేదెలు దాడి చేయటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం పెనగడప నుంచి పలువురు కూలీలు మంగళవారం సత్తుపల్లికి బయలుదేరారు. ఈ ఆటో యాతాలకుంట వద్ద రోడ్డు దాటుతుండగా, పక్క నుంచి అడవి గేదెలు దూసుకొచ్చి ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న పల్లపు రాజు, బోసు ఓదేలుకు గేదెల కొమ్ములు తాకడంతో తీవ్ర గాయాలు కాగా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తి మృతి

ఏన్కూరు: పశువులను మేతకు తీసుకెళ్లిన వ్యక్తిపై ఎలుగుబండి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... ఏన్కూరు మండలం కొత్త మేడేపల్లికి చెందిన మడకం సోమార్(40) సోమవారం ఉదయం పశువులు, మేకలను తీసుకుని తన ఇద్దరు కుమార్తెలతో సహా సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. అక్కడ ఆయనపై ఎలుగుబంటి దాడి చేసినట్లు తెలుస్తుండగా, ఆయన కుమార్తెలు మధ్యాహ్నం 3గంటలకు గ్రామానికి వచ్చి తల్లికి చెప్పారు. దీంతో గ్రామస్తులతో కలిసి ఘటనాస్థలికి వెళ్లి సోమార్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య కుమారి ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు మూడేళ్ల జైలుశిక్ష

సత్తుపల్లి టౌన్: మద్యం సేవించి లారీ నడిపి తండ్రీకుమారుల మృతికి కారణమైన డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి షేక్ మీరా ఖాసీం సాహెబ్ మంగళవారం తీర్పు వెలువరించారు. గత ఏడాది జూన్ 3వ తేదీన కిష్టారం గ్రామానికి చెందిన పిల్లి పేరయ్య(55), ఆయన కుమారుడు అశోక్‌కుమార్(35) సత్తుపల్లి నుంచి కిష్టారం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఇదే సమయాన హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై సీఐ టి.కిరణ్ కేసు నమోదు చేసి ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్ హర్షిత్ రాయ్‌పై చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణలో ఆయనపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ అబ్దుల్ బాషా వాదించగా పోలీసు కానిస్టేబుల్ శ్రావణ్‌రెడ్డి, హోంగార్డు ప్రవీణ్ సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన ఎస్.రామయ్య వద్ద బైపాస్ రోడ్డుకు చెందిన డి.శ్రీనివాసరావు 2017 మే నెలలో రూ.5లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2019 జూన్‌లో రూ.7.50లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, శ్రీనివాసరావు ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. దీంతో రామయ్య తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.7.50లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు.